కేరళ కొత్త చరిత్ర

రంజీల్లో తొలిసారి ఫైనల్స్‌కు అర్హత • టైటిల్ పోరులో విదర్భ తో అమీతుమీ

అహ్మదాబాద్: రంజీ ట్రోఫీ 2024-25 సీజన్‌లో కేరళ కొత్త చరిత్ర సృష్టించింది. 68 ఏండ్ల తమ రంజీ చరిత్రలో ఆ జట్టు తొలిసారి ఈ టోర్నీ ఫైనల్‌కు అర్హత సాధించింది. 1957లో మొదటిసారి రంజీ అరంగేట్రం చేసిన కేరళ.. 2018-19 సీజన్‌లో సెమీస్ చేరడమే ఇప్పటిదాకా అత్యుత్తమ ప్రదర్శన. 2 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఆ జట్టు ఫైనల్‌కు చేరింది. 429/7 వద్ద ఐదో రోజు ఆట ఆరంభించిన గుజరాత్.. మరో 29 పరుగులు (కేరళ తొలి ఇన్నింగ్స్ స్కోరు 457) చేస్తే ఫైనల్‌కు దూసుకెళ్లేది. కానీ కేరళ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆదిత్య సర్వతె అద్భుతం చేశాడు. ఓవర్ నైట్ బ్యాటర్లు సిద్ధార్థ్ దేశాయ్ (30), జయ్‌మీత్ పటేల్ (79) ఔట్ చేసిన అతడు.. 455 పరుగుల వద్ద నగ్వస్వల్ల (10)ను బోల్తా కొట్టించడంతో గుజరాత్ ఫైనల్ అవకాశాన్ని చేజార్చుకుంది. మ్యాచ్ డ్రాగా ముగిసినా ఫస్ట్ ఇన్నింగ్స్ ఆధిక్యంతో కేరళ టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఇక మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబైకి విదర్భ షాకిచ్చింది. ఆట ఆఖరి రోజు 406 పరుగుల భారీ ఛేదనలో ముంబై 325 పరుగులకే ఆలౌట్ అయి 80 రన్స్ తేడాతో ఓడింది. శార్దూల్ (66), ములాని (46), మోహిత్ (34) ముంబైని కాపాడే యత్నం చేసినా విదర్భ బౌలర్ హర్ష్ దూబె (5/127) రాణించడంతో ఆ జట్టు వరుసగా రెండోసారి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. విదర్భ, కేరళ మధ్య ఈనెల 26 నుంచి ఫైనల్ మొదలుకానుంది.

సఫారీలు సాఫీగా..

అఫ్గానిస్థాన్‌పై దక్షిణాఫ్రికా అలవోక విజయం

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీని దక్షిణాఫ్రికా ఘనంగా ఆరంభించింది. కరాచీ నేషనల్ స్టేడియం వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా.. 107 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాట్‌తో ఆ తర్వాత బంతితో సఫారీలు.. అఫ్గాన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేస్తూ యువ వికెట్ కీపర్ ర్యాన్ రికెల్టన్ (103) శతకంతో మెరవగా సారథి బవుమా (58), డసెన్ (52), మార్క్‌రమ్ (52 నాటౌట్) రాణించడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 315 పరుగుల భారీ స్కోరు చేసింది. సఫారీల తరపున గ్యారీ కిర్‌స్టెన్ తర్వాత చాంపియన్స్ ట్రోఫీలో ఆడిన ఆరంభ మ్యాచ్‌లోనే సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా రికెల్టన్ రికార్డులకెక్కాడు. అఫ్గాన్ స్పిన్ త్రయం నబీ, రషీద్, నూర్ అహ్మద్‌ను అతడు దీటుగా ఎదుర్కొని తన కెరీర్‌లో తొలి శతకం బాదాడు. ఇక ఛేదనలో అఫ్గాన్.. 43.3 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌట్ అయింది. రెహ్మత్ షా (90) ఒక్కడే నిలబడ్డాడు. సఫారీ పేసర్లలో రబాడా (3/36), మల్డర్ (2/36), ఎంగిడి (2/56) కాబూలీ బ్యాటర్లను కట్టడి చేశారు. రికెల్టన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

దాదాకు తప్పిన పెను ప్రమాదం

కోల్‌కతా: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి సౌరవ్ గంగూలీ పెను ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గురువారం అతడు ప్రయాణిస్తున్న కాన్వాయ్ రోడ్డు ప్రమాదానికి గురైంది. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను దాదా బుర్ద్వాన్ యూనివర్సిటీకి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తమ ముందు వెళ్తున్న ఓ లారీని ఓవర్‌టేక్ చేయబోతుండగా కారు డ్రైవర్ సడెన్‌గా బ్రేకులు వేయడంతో కాన్వాయ్‌లోని కార్లు ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. అయితే ఈ ప్రమాదం నుంచి అందరూ సురక్షితంగానే బయటపడ్డారని బెంగాల్ పోలీసులు తెలిపారు.

భారత్ జోరు

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత పురుషుల జట్టు జోరు కొనసాగుతోంది. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్.. 3-1తో ఐర్లాండ్‌ను ఓడించి వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మణ్‌దీప్ (22ని.), జర్మన్‌ప్రీత్ (45ని.), సుఖ్‌జీత్ (58ని.) భారత్‌కు మూడు గోల్స్ అందించారు. ఐర్లాండ్ నుంచి డంకన్ (8ని.) ఏకైక గోల్ చేశాడు. అమ్మాయిల విషయానికొస్తే భారత్ 0-4తో జర్మనీ చేతిలో ఘోర ఓటమి పాలైంది.

వన్డేలు బోర్ కొట్టేశాయా?

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

సంప్రదాయ టెస్టు క్రికెట్‌కు, మూడు గంటల్లోనే ముగిసే ధనాధన్ టీ20లకు మధ్య వన్డేల మనుగడ ప్రశ్నార్థకమవుతున్న వేళ పాకిస్థాన్‌లో జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ.. ఈ ఫార్మాట్‌కు ఓ దారిదీపంగా మారుతుందని భావించారంతా! టెస్టుల తర్వాత క్రికెట్‌లోని అసలు మజాను పంచడంలో వన్డేలకు ఉండే క్రేజే వేరు. సచిన్, గంగూలీ, స్టీవ్ వా, పాంటింగ్, సంగక్కర, కలిస్ వంటి నాటి తరం క్రికెటర్లు మొదలుకుని నేడు దిగ్గజాలుగా వెలుగొందుతున్న కోహ్లీ, రోహిత్, విలియమ్సన్, స్మిత్ ఈ ఫార్మాట్ ద్వారానే ప్రేక్షకుల అభిమానాన్ని చురగొన్నారు. కానీ చాంపియన్స్ ట్రోఫీలో మ్యాచ్‌లు జరుగుతున్న స్టేడియాలలో చూస్తే మాత్రం స్టార్ల మీద అభిమానం కాదు కదా! తమ దేశం ఆడుతున్నా ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. కరాచీలో జరిగిన రెండు మ్యాచ్‌లతో పాటు దుబాయ్‌లో భారత్, బంగ్లా మ్యాచ్‌కు స్టేడియాలు ఖాళీగా దర్శనమివ్వడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. మూడు దశాబ్దాల తర్వాత పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న ఐసీసీ ట్రోఫీని చూసేందుకు జనం వెల్లువెత్తుతారని, ప్రపంచంలో ఎక్కడా లేని ఆతిథ్యం తమ దేశంలో ఇస్తామని పాకిస్థాన్ తాజా, మాజీ క్రికెటర్లు బీరాలు పలికారు. కానీ స్వయానా తమ దేశం ఆడిన టోర్నమెంట్ ఆరంభ మ్యాచ్ (న్యూజిలాండ్‌తో)ను చూసేందుకు పాకిస్థానీలు పెద్దగా ఆసక్తి చూపలేదు. మధ్యాహ్నం 2:30 గంటలకు మ్యాచ్ మొదలైనప్పుడు స్టేడియంలో అక్కడొకరు ఇక్కడొకరు విసిరేసినట్టుగా కనిపించారు. పోనీ సాయంత్రం పాక్ బ్యాటింగ్ సమయంలో అయినా స్టాండ్లు నిండుతాయేమో అని భావించినా అప్పటికీ అదే పరిస్థితి. దీనిపై ఇంగ్లండ్ మాజీ సారథి మైఖేల్ వాన్ స్పందిస్తూ.. '1996 తర్వాత పాక్ మేజర్ ఐసీసీ టోర్నీకి ఆతిథ్యమిస్తుండటం సంతోషం. కానీ జనం ఏరి? వాళ్లు (పీసీబీ) స్థానిక ప్రజలకు టోర్నీ గురించి చెప్పడం మరిచిపోయారా?' అని చురకలు అంటించాడు. ఇక కొంతమంది ఎక్స్ యూజర్లు అయితే 'మొన్న ఢిల్లీలో విరాట్ కోహ్లీ రంజీ మ్యాచ్‌ను చూసేందుకు ఇంతకంటే ఎక్కువ జనం వచ్చారు' అని కామెంట్స్ చేశారు.

భారత్ మ్యాచ్‌కూ అదే కథ

ప్రత్యర్థి ఎవరైనా భారత్ ఆడుతుంటే ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్టేడియాలకు పోటెత్తే ప్రేక్షకులు.. దుబాయ్ స్టేడియం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. సుమారు 30వేల సీటింగ్ సామర్థ్యం ఉన్న దుబాయ్‌లో బంగ్లా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు గట్టిగా 2 వేల మంది కూడా కనబడలేదు. ఇది చూసిన ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోడీ స్పందిస్తూ.. 'భారత్, బంగ్లా మ్యాచ్ చూస్తున్నా. స్టాండ్స్ అన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. ఐపీఎల్‌లో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. వన్డే ఫార్మాట్ క్రికెట్ అభిమానులకు బోర్ కొట్టేసిందా? వన్డేలను రద్దు చేసి టెస్టులకు ప్రాధాన్యం పెంచాలా?' అని ట్వీట్ చేశాడు. భారత్ బ్యాటింగ్ చేసేప్పుడు కూడా సగాని కంటే ఎక్కువ స్టేడియం ఖాళీగానే కనిపించింది. దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్ మ్యాచ్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. ఈ నేపథ్యంలో వన్డేలను 40 ఓవర్లకు కుదించాలని, జనాన్ని ఆకర్షించే విధంగా ఈ ఫార్మాట్‌లో మార్పులు చేయాలని గతంలో రవిశాస్త్రి వంటి మాజీలు ఐసీసీకి సూచించిన విషయాన్ని ఫ్యాన్స్ ప్రస్తావిస్తున్నారు. చాలా దేశాలు ధనార్జనలో పడి టీ20 లీగ్‌లకే ప్రాధాన్యమిస్తూ వన్డేలను విస్మరిస్తున్నాయి. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత చాంపియన్స్ ట్రోఫీ ముందు వరకూ భారత్ ఆడిన వన్డేలు 9 మాత్రమే కావడం గమనార్హం.

ముంబై మెరిసె

బెంగళూరుపై ఉత్కంఠ విజయం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో మరో రసవత్తర పోరు అభిమానులను అలరించింది. ఆఖరి వరకు గెలుపు దోబూచులాడిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)పై ముంబై ఇండియన్స్‌దే పైచేయి అయ్యింది. శుక్రవారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై 4 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై ఉత్కంఠ విజయం సాధించింది. ఈ సీజన్‌లో బెంగళూరుకు ఇదే తొలి ఓటమి. ఆర్‌సీబీ నిర్దేశించిన 168 పరుగుల లక్ష్యాన్ని ముంబై మరో బంతి మిగిలుండగానే 6 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(50), నాట్ స్కీవర్(42) రాణించారు. వేర్‌హామ్(3/21)మూడు వికెట్లతో ఆకట్టుకుంది. తొలుత ఎలీస్ పెర్రీ(81) అర్ధసెంచరీతో ఆర్‌సీబీ 161/7 స్కోరు చేసింది. అమన్‌జోత్‌కౌర్(3/22) ధాటికి వ్యాట్(9), రాగ్వి(1), కనిక(3) విఫలమయ్యారు. అమన్‌జోత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ముంబై నయా జెర్సీ

రానున్న ఐపీఎల్ సీజన్ కోసం కొత్తగా రూపొందించిన జెర్సీలో తళుక్కుమన్న ముంబై ఇండియన్స్ స్టార్ క్రికెటర్లు హార్దిక్‌పాండ్యా, రోహిత్‌శర్మ

కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణపై భారత్ ఆసక్తి!

ఢిల్లీ: 2036లో ఒలింపిక్స్ పోటీలను నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్న భారత్.. అంతకంటే ముందే మరో ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులనూ దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. 2030లో జరగాల్సిన కామన్వెల్త్ క్రీడల నిర్వహణ పట్ల భారత్ ఆసక్తిగా ఉన్నట్టు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణకు సంబంధించి 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' తెలిపేందుకు గాను ఈ ఏడాది మార్చి 31 దాకా గడువుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రక్రియకు తుది మెరుగులు దిద్దుతున్నట్టు సమాచారం. ఒక వేళ 'కామన్వెల్త్' హక్కులను దక్కించుకుంటే.. గ్లాస్గోలో తొలిగించిన పది క్రీడాంశాలను 2030లో ఆడించే అవకాశముంది.

వయసు ఎవరూ పట్టించుకోరు: ధోనీ

ముంబై: వయసు గురించి ఎవరూ పట్టించుకోరని, క్రికెట్‌లో మనం ఏ స్థాయిలో పోటీ పడుతున్నామనదే ముఖ్యమని భారత దిగ్గజ క్రికెటర్ ఎమ్ఎస్ ధోనీ పేర్కొన్నాడు. ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచి ఆడుతున్న ధోనీపై చెన్నై ఎనలేని నమ్మకం పెట్టుకుంది. ఓవైపు వయసు పెరుగుతున్నా..తన చేవలో తగ్గలేదని ధోనీ నిరూపిస్తూనే ఉన్నాడు. ఐపీఎల్‌పై ధోనీ స్పందిస్తూ 'రెండు నెలలు జరిగే ఐపీఎల్ కోసం ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు కష్టపడుతాను. ఏడాదిలో కొన్ని రోజులే క్రికెట్ ఆడుతాను. అందుకోసం కష్టపడటాన్ని ఎంజాయ్ చేస్తాను' అని అన్నాడు.

ప్రేక్షకులు ఓ అడుగు ముందుకు వేసినట్లే..!

హీరో నాని సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'కోర్ట్- స్టేట్ వర్సెస్ ఏ నోబడీ' ఉపశీర్షిక. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ జగదీష్ దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. మార్చి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి నాని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా తీసినందుకు గర్వపడుతున్నా. ఇందులో చాలా సెన్సిటివ్ ఇష్యూని డీల్ చేశాం. సినిమా పూర్తయ్యాక నిలబడి క్లాప్స్ కొడతారు. ఇది నా గ్యారంటీ. అద్భుతమైన కోర్ట్ డ్రామాతో పాటు అందమైన ప్రేమకథ కూడా ఉంటుంది. ఇలాంటి సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అయితే ఇండస్ట్రీ, ఆడియన్స్ ఓ అడుగు ముందుకు వేసినట్లే' అన్నారు. ఒక్క సిట్టింగ్‌లోనే కథను ఓకే చేశానని, అంతలా నచ్చిందని ప్రియదర్శి తెలిపారు. గొప్ప బాధ్యతగా ఈ సినిమా చేశానని దర్శకుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోషన్, శ్రీదేవితో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

శ్రుతిలయ సీల్‌వెల్ కార్పోరేషన్-కళాకారులు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రముఖ నటీమణి, దర్శకురాలు దివంగత విజయనిర్మల జయంతి వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకలో భాగంగా డైరెక్టర్ జంధ్యాల 75 సంవత్సరాల వజ్రోత్సవ సంచికను ఆవిష్కరించారు. అలాగే, టాలీవుడ్ అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడికి 2025వ సంవత్సరానికి గాను విజయ కృష్ణా సిల్వర్ క్రౌన్ అవార్డును అందజేశారు. నటుడు నరేష్ తోపాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాణీకి మెగా ఆఫర్?

ఒకనాటి బాలీవుడ్ అందాల భామ రాణీ ముఖర్జీని ఓ క్రేజీ ఆఫర్ వరించిందని బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది.. పైగా అది హిందీ సినిమా కాదు.. తెలుగు సినిమా. అదికూడా చిరంజీవి సినిమా. వివరాల్లోకెళ్తే.. చిరంజీవి హీరోగా శ్రీకాంత్ ఓదెల ఓ యాక్షన్ అడ్వెంచర్ మూవీ చేయనున్న విషయం తెలిసిందే. ఇందులో హీరోయిన్ పాత్ర చాలా కీలకమట. అది కూడా మధ్య వయస్కురాలి పాత్రట. గొప్ప నటీమణులు మాత్రమే పోషించదగ్గ పాత్ర అని తెలుస్తున్నది. ఆ పాత్రకు రాణీ ముఖర్జీ పేరును సూచించారట దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. ఆ ప్రపోజల్‌కి చిరంజీవి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారట. తన వయసుకు తగ్గట్టుగా, డిగ్నిఫైడ్‌గా ఉంటుందని చిరంజీవి భావించడం వల్ల ఆ పాత్ర రాణీ ముఖర్జీని వరించిందని ఫిల్మ్ వర్గాల టాక్. చిరంజీవి 158వ సినిమాగా తెరకెక్కనున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రీపొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతున్నది. త్వరలోనే నటీనటులను, సాంకేతిక నిపుణులను ఖరారు చేస్తారట.

చిత్రం

తుది దశలో 'కింగ్‌డమ్'

అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్నది. మే 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. 'ఇంత బీభత్సం ఎవరి కోసం..రణభూమిని చీల్చుకొని పుట్టే కొత్త రాజు కోసం..' అనే సంభాషణలతో టీజర్ గూస్‌బంప్స్ తెప్పించింది. పీరియాడిక్ కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. తుది షెడ్యూల్ వైజాగ్‌లో మొదలైంది. మార్చి మొదటివారం వరకు జరిగే షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుందని తెలుస్తున్నది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జోమోన్ టి జాన్, గిరీష్ గంగాధరన్, ఆర్ట్: అవినాష్ కొల్లా, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, రచన-దర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

సాధారణంగా సినిమా పరిశ్రమలో ఒక హీరోయిన్‌ని మరో హీరోయిన్ పొగడటం అరుదు. కానీ అలియా భట్ మాత్రం ఇగో పక్కన పెట్టి, తన తోటి హీరోయిన్ రష్మిక మందన్నాను పొగడ్తలతో ముంచెత్తింది. విక్కీ కౌశల్, రష్మిక జంటగా నటించిన 'ఛావా' సినిమా ఇటీవలే విడుదలైన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా పాజిటివ్ టాక్‌తో భారీ వసూళ్లతో దూసుకుపోతున్న 'ఛావా'ను రీసెంట్‌గా అలియాభట్ చూసింది. వెంటనే ఇన్‌స్టా ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ' 'ఛావా' ఓ అద్భుతం. ముందుగా డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్‌కి అభినందనలు. చాలా గొప్పగా తీశారు. విక్కీ కౌశల్ అద్భుతంగా నటించారు. నా అభిమాన నటుడు అక్షయ్ ఖన్నా ఔరంగజేబుగా మారిపోయారు. ఇక రష్మిక.. 'చాలా అందంగా ఉన్నావు.. ముఖ్యంగా నీ కళ్లు..' ' అంటూ ప్రశంసలు గుప్పించింది అలియా భట్. అలియా పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

చాలా బాగున్నావు.. ముఖ్యంగా నీ కళ్లు..

సొమ్మసిల్లిపోతున్నవే ఓ సిన్నారాములమ్మ

సందీప్‌కిషన్, రీతూవర్మ జంటగా నటించిన చిత్రం 'మజాకా'. త్రినాథ రావు నక్కిన దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజేష్ దండా, ఉమేష్ కేఆర్ బన్సల్ నిర్మించారు. ఈ నెల 26న విడుదలకానుంది. శుక్రవారం 'సొమ్మసిల్లి పోతున్నవే.. ఓ సిన్నారాములమ్మ' అంటూ సాగే పాటను విడుదల చేశారు. జానపద శైలిలో సాగిన ఈ గీతానికి లియోన్ జేమ్స్ సంగీతాన్ని సమకూర్చారు. రేవంత్ ఆలపించారు. ఈ పాటలో నాయకానాయికలు సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేశారు. విజువల్స్‌తో పాటు మోయిన్ మాస్టర్ అందించిన నృత్యరీతులు పాటలో హైలైట్‌గా నిలిచాయి. ఆద్యంతం వినోదప్రధానంగా సాగే చిత్రమిదని, ఫ్యామిలీ ఆడియెన్స్‌ను మెప్పించే అన్ని అంశాలుంటాయని మేకర్స్ తెలిపారు. రావు రమేష్, అన్షు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ, దర్శకత్వం: త్రినాథరావు నక్కిన.

అతిథి పాత్రలో హరీశ్‌శంకర్

ప్రముఖ దర్శకుడు హరీశ్‌శంకర్ వెండితెరపై అతిథి పాత్రలో మెరవనున్నారు. 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో ఆయన కీలకమైన గెస్ట్‌రోల్‌ను పోషించారు. సుహాస్, మాళవిక మనోజ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ గోధల దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మాత. ఈ వేసవిలో సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. 'హరీశ్‌శంకర్ అతిథి పాత్ర అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ పాత్ర ఆయన చేస్తేనే బాగుంటుందని భావించాం. హరీశ్‌శంకర్‌కు సంబంధించిన సన్నివేశాలను ఇటీవలే పూర్తి చేశాం. ఆద్యంతం వినోదంతో ఆకట్టుకునే చిత్రమిది' అని మేకర్స్ తెలిపారు. అనితా హాసనందిని, అలీ, పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రధన్, రచన-దర్శకత్వం: రామ్ గోధల.

భైరవం శివతత్వం

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ నటిస్తున్న మాస్ ఎంటర్టైనర్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. సమ్మర్‌లో సినిమా విడుదల కానుంది. దాంతో ఈ సినిమా ప్రమోషన్స్ వేగవంతం చేశారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. శుక్రవారం ఈ సినిమాలోని 'భైరవం' థీమ్ సాంగ్‌ని విడుదల చేశారు. రానున్న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం విడుదలైన ఈ ఆధ్యాత్మిక గీతం అత్యంత శక్తిమంతంగా ఉద్వేగపూరితంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ గీతాన్ని శ్రీచరణ్ పాకాల స్వరపరచగా, శంకర్ మహాదేవన్ ఆలపించారు. శంకర్‌మహాదేవన్ గాత్రం ఈ పాటలో తెలియని గొప్ప శక్తిని నింపిందని, బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కూడా అద్భుతంగా అభినయించారని, శివతత్వంలోని గొప్పతనాన్ని ఈ గీతం ఆవిష్కరిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఓ ఆలయం ముందు ఈ పాటను చిత్రీకరించారు. నారా రోహిత్, మంచు మనోజ్, అదితి శంకర్, దివ్య పిళ్లై కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: సత్యర్షి, తూమ్ వెంకట్, కెమెరా: హరి కె.వేందాంతం, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.

'లెవెన్' స్వరాలు

నవీన్‌చంద్ర హీరోగా రూపొందిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకుడు. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మాతలు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో సినిమాను రూపొందించారు. ఈ సమ్మర్‌లో విడుదల కానుంది. తాజాగా ఈ మూవీలోని 'ఇక్కడ రా..' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. రాకేందు మౌళి రాసిన ఈ గీతాన్ని డి.ఇమ్మాన్ స్వరపరచగా, ఆండ్రియా జెరెమియా పాడటంతోపాటు పర్‌ఫార్మ్ చేశారు. ఈ పాటలో ఆండ్రియా మూమెంట్స్ ఆకట్టుకుంటాయని, సినిమాకు ఈ పాట ఓ హైలైట్‌గా నిలుస్తుంది మేకర్స్ చెబుతున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.